## మినీకథ



# న్యాయం నిదురించిన వేళ

పి. కృష్ణవేణి

‘కృష్ణా ఎక్స్‌ప్రెస్’ కాజీపేట స్టేషనులో ఆగింది.

మామూలుకు భిన్నంగా ఆ రోజు ‘రైట్ టైమ్’లో నడుస్తున్నది. విజయవాడకు రావల్సిన ‘ఈస్ట్ కోస్ట్’ మూడున్నర గంటలు లేటవడంతో ఏమాత్రం ‘వెయిట్’ చెయ్యాల్సిన అవసరం లేకపోవటంతో విజయవాడ నుంచే ‘రైట్ టైమ్’లో నడిచి కాజీపేట చేరింది.

రైల్వే పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ సుందర్రావు తన సిబ్బంది కొంతమందితో ప్లాట్‌ఫారంమీద హడావుడిగా నడుచుకుంటూ ‘మొదటి తరగతి ఛైర్‌కార్’ దగ్గరకి వచ్చాడు.

సీటు కోసమై కండక్టరును వత్తిడి చేసినా — మరు రోజు పండుగ సెలవు అవటంవల్లనూ, “ఈస్ట్‌కోస్ట్” బోగీలు లేనందువల్లనూ, ట్రైన్ చాలా “ఓవర్ క్రౌడెడ్”గా ఉన్నదని. సికింద్రాబాదు వరకూ మధ్యలో దిగే మొదటి తరగతి ప్రయాణీకులు ఎవరూ లేరని తాను చేయగలిగినది ఏమీలేదని చెప్పేసరికి సుందర్రావు హతాశుడైనాడు.

సుందర్రావు ఎప్పుడోగాని మొదటి తరగతిలో ప్రయాణించడు. ఒకవేళ ఏనాడైనా ఎక్కినా ఎవరో పై అధికారి కనిపించటం. మర్యాదకోసం తన సీటును వారికి ఆఫర్ చేసి నిలబడి ప్రయాణించడం అలవాటే అతనికి.

కాని ఈ రోజు జడ్జిగారు పండక్కి ఇంటికని బయలుదేరారు. పై అధికారులనించి సుందర్రావుకి జడ్జిగార్ని దగ్గరుండి ట్రైన్‌లో పంపించవలసిందిగా ఉత్తర్వులు వచ్చాయి.

తన క్రింది ఉద్యోగులపై నెట్టేందుకు వీలుకాకపోవటంతో తానే స్వయంగా రంగ ప్రవేశం చెయ్యవలసివచ్చింది. అయినా వ్యవహారం లాభం లేకపోయేటట్లు వుంది— అని కండక్టరును ప్రతిమలాడ సాగాడు తన పరువు కాపాడమని.

కాని కండక్టర్—“నన్నేం చెయ్యమంటారు? కనీసం నాకైనా సీటుంటే దాన్నైనా ఇచ్చివుండేవాడిని. విజయవాడ నుంచే “సీట్స్” అన్నీ “ఫుల్”గా వస్తున్నాయి. ఎవర్ని లేవమనగలను? మీరే చెప్పండి?” అని సుందర్రావునే ఎదురు ప్రశ్నించాడు.

ఇంతలో “సింగరేణి” నుంచి విడదీసిన సికింద్రాబాద్ బోగీ “కృష్ణా”కు తగిలించగా కలిగిన కుదుపుకు గుండె గుభేలుమన్నది.

ఈ లోపల మెల్లగా ఠీవిగా జడ్జిగారు “చైర్‌కార్” వద్దకు వచ్చి నిల్చున్నారు.

వారి జవాను పెట్టెలతో వచ్చి సుందర్రావును— “అయ్యగారి సీటెక్కడ!”— అని దాదాపు గదమాయించినట్లు అడిగాడు.

దిక్కుతోచక నిలబడిన సుందర్రావుకు బుర్ర వేడెక్కింది. అంత శీతాకాలంలోనూ చెమటలు పోశాయి.

జడ్జిగారికి సీటు దొరక్కపోతే తనపై అధికారుల దీవెనలెన్నివిధాలా అందుకోవాలో కళ్ళముందు సినిమా రీలులా గిర్రున తిరుగుతోంది.

ఇంతలో సుందర్రావుకు విశ్వాసపాత్రుడు హుస్సేన్ అనే రక్షకభటుడు సుందర్రావు చెవిలో ఏదో ఊదటం, దాదాపు అదే సమయంలో తనభటులిద్దరూ ‘చైర్‌కార్’లో కూర్చున్న వ్యక్తుల్లోకొంచెం తక్కువ రకం దుస్తులు ధరించి వస్త్రధారణ కనుగుణంగా శరీర స్థితి కలిగిన ఒక వ్యక్తిని అమాంతం చేయి పట్టుకుని లేవటం ఒకేసారి జరిగాయి.

సుందర్రావు వెంటనే లోపలికి వచ్చి దర్పం ఉట్టిపడే కంఠంతో సదరు వ్యక్తితో బిగ్గరగా — “మిస్టర్! ఇందాకటి నుంచీ నీకోసం వెతుకుతున్నాను. నిన్ను అరెస్ట్ చేయమని విజయవాడ నుంచి మెసేజి వచ్చింది. నిన్ను అరెస్ట్ చేస్తున్నాను.” అని డైలాగ్ చెప్పగానే రక్షకభటులు సదరు వ్యక్తిని దాదాపు ఈడ్చినట్టుగానే “ట్రైన్” దింపేశారు.

ఇంతలో కదలబోతున్న “ట్రైన్”ను చైన్ లాగి ఆపించిన సుందర్రావు కండక్టరుకు సైగ చెయ్యటం. ఆ సైగకు జడ్జిగారికి సదరు సీటు ‘ఎలాట్’ చెయ్యటం, వారు గజ గమనంతో బోగీ ప్రవేశం గావించటం జరిగినాయి.

ఆ తర్వాత వారు సుఖాసీనులవగానే కిటికీ దగ్గర్నుంచి సుందర్రావు కొట్టిన ‘సెల్యూట్’కు తల పంకించారు.

‘కోచ్ ఎటెండర్’ తెచ్చిన కూల్‌డ్రింక్ సీసాను పైకెత్తారు జడ్జిగారు.

దాన్ని ‘సిగ్నల్’గా భావించిన గార్డుపచ్చ జండా ఊపటంతో నిట్టూరుస్తూ ‘కృష్ణా’ కదిలింది పావుగంట లేటుతో.

వేగం పుంజుకున్న ‘ట్రైన్’లో జడ్జిగారు సీటులో వెనక్కివాలి నిద్ర కుపక్రమించారు.

ఆ తర్వాత సదరు బక్క ప్రాణితో హుస్సేన్ “నిన్ను పొరపాటున దించామయ్యా. మేము వెతుకుతున్న మనిషి నువ్వుకాదు. కాబట్టి ‘నెక్స్ట్ ట్రైన్’కి నిన్ను దగ్గరుండి ఎక్కించి పంపించే బాధ్యత మాది” అని అనవచ్చు.

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada- 10
Editor : Puranam Subrahmanya Sarma.